మా గోడు పట్టించుకోండి సారూ..



కలెక్టరేట్‌లో వినతులు స్వీకరిస్తున్న అధికారులు

- కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక
- వినతుల స్వీకరణ

'సంవత్సరాల తరబడి తిరుగుతున్నా.. మా సమస్యలకు పరిష్కారం లభించడం లేదు.. మండలాల్లో మా గోడు పట్టించుకునే వారే లేకుండాపోయారు.. మీరైనా తగిన పరిష్కారం చూపండి సారూ' అంటూ జిల్లా నలుమూలల నుంచి ప్రజలు నెల్లూరు కలెక్టరేట్‌కు తరలివచ్చి వారి బాధలు చెప్పుకున్నారు. ఈ మేరకు తిక్కన ప్రాంగణంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వారు అధికారులకు వినతి పత్రాలు సమర్పించారు. వీటిని కలెక్టర్ ఆనంద్ పరిశీలించి సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. కాగా బాధితుల మాటల్లో కొన్ని ఇలా ఉన్నాయి.

– నెల్లూరు(అర్బన్)

మా భూమిని ఆక్రమించారు

మా కుటుంబం గత 60 ఏళ్ల నుంచి సాగు చేసుకుంటున్న మూడు ఎకరాల భూమిని తమకు తెలియకుండా కొంత మంది డీఫామ్ పట్టా తెచ్చుకున్నారు. ఇందుకు రెవెన్యూ అధికారులు సహకరించారు. మా గ్రామంలో ఎవరిని అడిగినా ఈ భూమి తమదేనని చెబుతారు. ఆ భూమిని ఓ మహిళ తనకు పట్టాగా ఇచ్చినట్లు చెప్పుకుంటున్నారు. దీనిపై అధికారులు స్పందించి ఆమె పట్టాను రద్దు చేసి తమకు న్యాయం చేయాలి.



– మస్తానమ్మ, కుటుంబ సభ్యులు, కనుపర్తి గ్రామం, పొదలకూరు మండలం

ధోబీఘాట్‌ను ఆక్రమించేశారు

1990లో తమకు ప్రభుత్వం సర్వేనంబర్ 1105లో 2.20 ఎకరాలు ధోబీఘాట్‌కు మంజూరు చేసింది. అప్పటి నుంచి తాము అక్కడే తమ వృత్తి పనులైన దుస్తులను ఉతుకుంటున్నాం. అయితే కొందరు ఇటీవల ధోబీఘాట్‌లను ధ్వంసం చేసి చదును చేసి వరిపైర్లు వేసుకున్నారు. ఈ విషయమై ఆర్డీఓకు వినతి పత్రం ఇచ్చాం. అధికారుల మాటలు కూడా లెక్క చేయకుండా అక్కడ సాగు చేస్తున్నారు. దీనిపై కొంతకాలం క్రితం కోర్టుకు కూడా వెళ్లాం. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి తమకు ఇచ్చిన భూములను విడిపించాలి.



– తుమ్మల శ్రీనివాసులు, మధు, సుబ్రహ్మణ్యం, కొత్తకోడూరు రజక యువజన సేవా సంఘం

గడువులోపు పరిష్కారం చూపాలి

నెల్లూరు(బారకాసు) : ప్రజల నుంచి అందుకున్న ఫిర్యాదులు పునరావృతం కాకుండా నిర్ణీత గడువులోపు పరిష్కారం అందించాలని కమిషనర్ సూర్యతేజ ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఎన్ఎంసీ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి ఆయన అర్జీలు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ భవన నిర్మాణ అనుమతులను కేవలం 24 గంటల్లోనే మంజూరు చేస్తున్నామని తెలిపారు. నిబంధనలను ఉల్లంఘిస్తే ఉపేక్షించబోమని, ఆయా నిర్మాణాలను కూల్చివేస్తామని హెచ్చరించారు. పార్కులను శుభ్రం చేసి పర్యవేక్షించాలని ఇంజినీరింగ్ అధికారులకు, హార్టికల్చర్ ఏడీ ప్రదీప్‌కు ఆదేశాలు జారీ చేశారు. మొత్తం 46 ఫిర్యాదులు అందుకున్నామని, ఇందులో విభాగాల వారీగా ఇంజినీరింగ్ విభాగం 17, అడ్మినిస్ట్రేషన్ 2, హౌసింగ్ 7, పబ్లిక్ హెల్త్ 4, టౌన్‌ప్లానింగ్ 14, పెన్షన్ విభాగం 2 చొప్పున అర్జీలు స్వీకరించామన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ నందన్, సిటీ ప్లానర్ హిమబిందు, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ చైతన్యతో పాటు ఇతర అధికారులు, సూపరింటెండెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ సూర్యతేజ

ఫిట్‌నెస్ లేని బస్సులపై చర్యలు తీసుకోవాలి

నెల్లూరు (టౌన్) : ఫిట్‌నెస్ లేకుండా తిరుగుతున్న విద్యాసంస్థల బస్సుల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నరేంద్ర సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుచ్చిరెడ్డిపాళెం మండలం మినగల్లు సమీపంలో సోమవారం స్కూల్ బస్సు బోల్తా పడిందని, బస్సు ఫిట్‌నెస్ లేకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగిందన్నారు. బస్సులో ఉన్న కొంతమంది పిల్లలు గాయాలపాలయ్యారని చెప్పారు. బస్సు నడిపిన పాఠశాలకు ప్రభుత్వ గుర్తింపు కూడా లేదని, బస్సులు తిప్పేందుకు అధికారులు ఎలా అనుమతి ఇచ్చారని ప్రశ్నించారు. ఈ పాఠశాలను వెంటనే సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ప్రమాదంలో గాయపడిన పిల్లలకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. ఇప్పటికైనా ఫిట్‌నెస్ లేకుండా తిరుగుతున్న విద్యాసంస్థల బస్సులపై చర్యలు తీసుకోవాలని, లేకుంటే జిల్లా వ్యాప్తంగా ఆందోళనకు శ్రీకారం చుడుతామని హెచ్చరించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగరంలోని శెట్టిగుంట రోడ్డు సబ్‌స్టేషన్ పరిధిలో మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఉంటాయని ఆశాఖ టౌన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని రాజీవ్ గాంధీ కాలనీ, మధురానగర్, ప్రశాంతినగర్, పల్లిపాడు రోడ్డు, కిసాన్‌నగర్, జాకీర్‌హుస్సేన్ నగర్, మైపాడు రోడ్డు, వేణుగోపాల్‌నగర్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి సాయంత్రం 5 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఉంటాయని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

క్రీడాకారులకు అభినందన

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : జైపూర్‌లో ఈనెల 3వ తేదీ నుంచి జరుగుతున్న 41వ ఎన్‌టీపీసీ సబ్ జూనియర్ జాతీయ ఆర్చరీ చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తాచాటారు. మిక్స్‌డ్ విభాగంలో ఉమ్మడి నెల్లూరు జిల్లా గూడూరుకు చెందిన ఆర్.సాయి మౌర్య, కృష్ణా జిల్లాకు చెందిన యుక్తశ్రీలు రాజస్థాన్ జట్టుపై ఫైనల్‌లో బంగారు పతకం సాధించారు. వీరిని అక్కడ నెల్లూరుకు చెందిన కోచ్ టి.శివశంకర్‌తో పాటు జిల్లా ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పల్లంరెడ్డి శ్రీహర్ష, పావురాల వేణు సోమవారం అభినందించారు.



రెవెన్యూలో బదిలీలు

నెల్లూరు(అర్బన్) : మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లుగా (ఎంఆర్ఐ) పనిచేస్తున్న వారిని సీనియర్ అసిస్టెంట్‌లుగా ఇతర మండలాలకు బదిలీ చేస్తూ కలెక్టర్ ఆనంద్ సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. రాజనారాయణ అనే ఎంఆర్ఐను సంగం నుంచి ఆత్మకూరు ఆర్డీఓ ఆఫీస్‌కు బదిలీ చేశారు. అలాగే వాజీద్‌ను బోగోలు నుంచి కావలి ఎస్‌డీసీకు, అశ్వర్థనారాయణను మనుబోలు నుంచి వెంకటాచలం తహసీల్దార్ కార్యాలయానికి, సురేంద్రను ఉదయగిరి నుంచి కావలి ఎస్‌డీసీకు, వెంకటేశ్వర్లును చేజర్ల నుంచి ఆత్మకూరు ఆర్డీఓ ఆఫీస్‌కు, పృథ్వీరాజ్‌ను ఆత్మకూరు నుంచి కావలి ఎస్‌డీసీకి, ఎం.శ్రీజను జలదంకి తహసీల్దార్ కార్యాలయానికి బదిలీ చేశారు. అలాగే సీనియర్ అసిస్టెంట్‌లుగా పనిచేస్తున్న వారిలో పలువురి కాలపరిమితి ముగియడంతో వారిని ఆర్ఐలుగా బదిలీ చేస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. కలెక్టరేట్‌లో పనిచేస్తున్న సుధీర్‌కుమార్‌ను కలువాయి తహసీల్దార్ కార్యాలయానికి, కలెక్టరేట్‌లోనే పనిచేస్తున్న రవితేజను రాపూరుకు, టీజీపీలో పనిచేస్తున్న చాణక్యను నెల్లూరు రూరల్‌కు, వెంకటాచలంలో పనిచేస్తున్న కృష్ణవేణమ్మను పొదలకూరుకు, జలదంకిలో పనిచేస్తున్న రమాదేవిని ఉదయగిరికి, ఏఎస్‌పేటలో పనిచేస్తున్న కొండయ్యను ఆత్మకూరుకు, నెల్లూరులో ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న ఎ.మోహన్‌ప్రతాప్‌ను కావలికి బదిలీ చేశారు.

తెలుగు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి

నెల్లూరు(బృందావనం) : తెలుగు భాషాభివృద్ధికి ఉభయ తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలని తిక్కన మహాకవి లలిత కళాపీఠం అధ్యక్షుడు ఆలూరు శిరోమణిశర్మ తెలిపారు. పొగతోటలోని ఆదిశంకర ధ్యాన మందిరంలో సోమవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు భాషాభివృద్ధికి కృషి చేస్తున్న చలంచర్ల భాస్కర్‌రెడ్డి, పి.అన్నపూర్ణ, కొండమ్మ, సీహెచ్.వెంకటేశ్వరరావు, ఎ.జయప్రకాష్, ఫాతిమా, మైపాడు రాజా, జి.సుభద్రాదేవి తదితరులను సన్మానించారు.



కవులు, రచయితలకు సన్మానం

మేయర్ పరామర్శ

నెల్లూరు(బారకాసు) : నుడా మాజీ డైరెక్టర్ షేక్.ఖాజావలీని నగర మేయర్ స్రవంతి సోమవారం పరామర్శించారు. ఆయన సతీమణి నూర్జహాన్ బేగం ఇటీవల అనారోగ్యంతో మృతిచెందడంతో బాలాజీనగర్‌లోని ఖాజావలీ నివాసానికి వెళ్లి ధైర్యం చెప్పారు.



ఫ్లెక్సీల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..

నెల్లూరు(బారకాసు) : కార్పొరేషన్ పరిధిలో ఇష్టానుసారం ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలపై ఈనెల 3వ తేదీన 'విచ్చలవిడిగా ఫ్లెక్సీల ఏర్పాటు' అనే శీర్షికన సాక్షి దినపత్రికలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. ఈ మేరకు నగరంలోని పలు వీధుల్లో అనుమతుల్లేకుండా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించే పనులు సోమవారం చేపట్టారు. అయితే పూర్తిస్థాయిలో అన్ని ఫ్లెక్సీలను తొలగిస్తారా.. లేక అధికార పార్టీ ప్రజాప్రతినిధులకు సంబంధించిన వాటిని వదిలేసి మిగిలిన వాటిని మాత్రమే తొలగిస్తారా.. అనేది వేచి చూడాలి.



ఉస్మాన్‌సాహెబ్‌పేటలో ఫ్లెక్సీని తొలగిస్తున్న ఎన్ఎంసీ సిబ్బంది

సంస్కృతిని కాపాడుకుందాం

నెల్లూరు (అర్బన్) : మన తెలుగువారి సంస్కృతిని కాపాడుకుందామని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (పీఎంపీ), బ్లాక్ బోర్డు మిత్రమండలి సంయుక్త ఆధ్వర్యంలో సాంప్రదాయాలను కాపాడుకుందాం అనే పేరుతో ప్రచురించిన కరపత్రాలను సోమిరెడ్డి నివాసంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్, ఫైబర్ లాంటి వాటిని భోగి మంటల్లో వేయకుండా తాటాకులు, కట్టెలను కాల్చాలన్నారు. ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ శ్యామ్‌ప్రసాద్, శశాంక్, ఆర్ఎంపీ అధ్యక్షుడు కోలా రవీంద్రబాబు, పీఎంపీ అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్, శేషయ్య, మహ్మద్‌గౌస్, రాఘవయ్య పాల్గొన్నారు.



కరపత్రాల ఆవిష్కరణ

నేత్రదానం

నెల్లూరు(అర్బన్) : అభిషేక్ అనే యువకుడు మృతిచెందగా అతని నేత్రాలను కుటుంబసభ్యుడు గంటా కిరణ్‌కుమార్ అంగీకారంతో సోమవారం ప్రభుత్వ వైద్యశాలకు దానం చేశారు. ఎల్వీ ప్రసాద్ ఐ టెక్నీషియన్ సునీల్ మృతుడి నేత్రాలను సేకరించారు. ఈ మేరకు కుటుంబసభ్యులకు నేత్రదాన సర్టిఫికెట్ అందజేశారు. నేత్రదాన మోటివేటర్ బాలాజీ పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రజాభిప్రాయ సేకరణ

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : విద్యుత్ సంస్థలు ప్రతిపాదించిన వార్షిక ఆదాయ అవసరాల నివేదికపై నిర్వహించనున్న ప్రజాభిప్రాయ సేకరణ నేటి నుంచి ప్రారంభమవుతుందని, వినియోగదారులు పాల్గొనాలని ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ విజయన్ అన్నారు. నగరంలోని విద్యుత్ భవన్‌లో ఆయన సోమవారం మాట్లాడారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరిగే ప్రజాభిప్రాయ సేకరణకు సంబంధించి జిల్లాలోని అన్ని విద్యుత్ డివిజన్ కార్యాలయాల్లో ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.

గాయపడిన యువకుడి మృతి

నెల్లూరు(క్రైమ్) : రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. బాలాజీనగర్ సీఆర్పీ డొంకలో బీబీజాన్ కుటుంబం నివాసం ఉంటోంది. ఆమె కుమారుడు అల్తాఫ్(20) ఈనెల 5వ తేదీన బైక్‌పై భగత్‌సింగ్‌కాలనీకి వెళ్లారు. అక్కడ పనిముగించుకుని ఆత్మకూరు ఫ్లైఓవర్ మీదుగా ఇంటికి బయలుదేరారు. బ్రిడ్జి చివర మలుపు వద్ద బైక్ అదుపు తప్పడంతో అల్తాఫ్ తలకు గాయాలయ్యాయి. స్థానికులు జీజీహెచ్‌కు తరలించగా, మెరుగైన చికిత్స నిమిత్తం నారాయణ హాస్పిటల్లో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత యువకుడు మృతి చెందాడు. ఈ మేరకు మృతుని తల్లి బీబీజాన్ నార్త్ ట్రాఫిక్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు కేసు నమోదు చేశారు.

భూగర్భ జలాలు అడుగంటుతున్నాయ్

నెల్లూరురూరల్ : ముత్తుకూరు మండలంలో పరిశ్రమలు అధికంగా రావడం వల్ల భూగర్భ జలాలు అడుగంటుతున్నాయని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ సభ్యుడు శ్రీరాములు వెంకటేశ్వర్లు తెలిపారు. నగరంలోని జర్నలిస్ట్ భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముత్తుకూరు మండలంలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న పరిశ్రమలకు బోర్ల ద్వారా నీటిని తోడేస్తున్నారని, దీని వల్ల ప్రజలు అవస్థలు పడుతున్నారని చెప్పారు. ప్రస్తుతం 70 అడుగులు తవ్వినా నీరు లేదని, బోర్ల ద్వారా ప్రైవేట్ వ్యక్తులు నీటిని తోడేసి పరిశ్రమలకు అమ్మేస్తున్నారని ఆరోపించారు. దీనిపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌కు ఫిర్యాదు చేసినట్లు వివరించారు. వేణుగోపాల్, కె.నాగయ్య, జయరాం, ముంగర మస్తాన్, వేణుగోపాల్, మధు ఉన్నారు.



మాట్లాడుతున్న శ్రీరాములు వెంకటేశ్వర్లు

లఘుచిత్రానికి మూడు అవార్డులు

నెల్లూరు(బృందావనం) : హైదరాబాద్‌కు చెందిన పద్మశ్రీ భానుమతి రామకృష్ణ మెమోరియల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన షార్ట్‌ఫిల్మ్ పోటీల్లో నెల్లూరీయులకు చెందిన 'పండుటాకులు' అనే లఘుచిత్రానికి మూడు అవార్డులు వరించాయి. ఈ మేరకు చిత్ర దర్శకుడు కళాంజలి అనంత్ సోమవారం మాట్లాడుతూ ఉత్తమ చిత్రం, ఉత్తమ మాటల రచయితగా డాక్టర్ కేకే రామచంద్ర మూర్తి, క్యారెక్టర్ యాక్టర్‌గా మునిచంద్ర హైదరాబాద్‌లో అవార్డులను అందుకున్నారన్నారు. అలాగే పాటల పోటీల్లో జ్ఞానశ్రీ ద్వితీయ బహుమతి సాధించారని తెలిపారు.



అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

నెల్లూరు(సెంట్రల్) : రూరల్ పరిధిలో అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. స్థానిక 36వ డివిజన్‌లో పలు అభివృద్ధి పనులకు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డితో కలిసి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం రూ.68 లక్షలతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశామన్నారు. స్థానిక కార్పొరేటర్లు పాల్గొన్నారు.



36వ డివిజన్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే

వెచ్చటి నేస్తాలు

- చలికాలంలో ఉన్ని దుస్తులకు డిమాండ్
- ఇతర రాష్ట్రాల నుంచి వస్తున్న వ్యాపారులు
- మక్కువ చూపుతున్న నగర వాసులు

నగరంలో రోజురోజుకు చలి తీవ్రత పెరుగుతోంది. సాయంత్రం 6 గంటలకే మంచు కురవడం ప్రారంభమవుతోంది. రాత్రి 9 దాటితే మంచు పెరగడంతో విపరీతమైన చలితో వణికిపోయే పరిస్థితి ఏర్పడింది. ఫలితంగా ఉన్ని దుస్తులకు భలే గిరాకీ ఏర్పడింది.

నెల్లూరు(బారకాసు) : నగర ప్రజలతో పాటు జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల నుంచి నగరానికి రాకపోకలు సాగించే వారిని చలి భయపెడుతోంది. దీని నుంచి రక్షణ పొందేందుకు ప్రజలకు స్వెట్టర్లను కొనుగోలు చేస్తున్నారు. ముఖ్యంగా తెల్లవారుజామున పనిచేసే పాల వ్యాపారులు, కూరగాయల వ్యాపారులు, పేపర్ బాయ్స్ తదితరులు చలిని తట్టుకునేందుకు అనుకూలమైన, నచ్చిన వివిధ రకాల ఉన్ని వస్త్రాలను కొనుగోలు చేస్తున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారు నగరంలోని జీటీరోడ్డు, పొదలకూరు రోడ్డు, మినీ బైపాస్‌రోడ్డు తదితర ప్రధాన రహదారుల పక్కనే దుకాణాలను ఏర్పాటు చేసుకున్నారు. ఇక్కడ వివిధ రకాల ఉన్ని దుస్తులు దర్శనమిస్తున్నాయి. పలు రకాల డిజైన్లలో స్వెట్టర్లు, టోపీలు, శాలువాలు, మఫ్లర్లు, మంకీ క్యాప్‌లను అమ్మకాలకు పెట్టారు. పిల్లల నుంచి పెద్దల వరకు వివిధ సైజుల్లో పలు డిజైన్లలో అమ్మకాలు జరుగుతున్నాయి. వీటిలో మహిళలకు ప్రత్యేక స్వెట్టర్లు కూడా ఉన్నాయి. పెద్దలకు స్వెట్టర్లు రూ.200 నుంచి రూ.800, చిన్నపిల్లలకు రూ.150 నుంచి 300 వరకు ఉన్నాయి. అదేవిధంగా చలికి, వర్షానికి వేసుకునే దుస్తులు రూ.600 నుంచి రూ.1200 వరకు అమ్ముతున్నారు.



20 ఏళ్లుగా అనుబంధం

ఒడిశా, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, ఢిల్లీ, నేపాల్ వాసులకు నెల్లూరుతో 20 ఏళ్లుగా అనుబంధం ఉంది. చలికాలం మొదలవుతుందంటే ఆయా ప్రాంత వాసులు నెల్లూరు వచ్చేస్తున్నారు. మహారాష్ట్ర, రాజస్థాన్, లుథియానా, పంజాబ్ తదితర ప్రాంతాల నుంచి ఉన్ని దుస్తులను తీసుకొచ్చి విక్రయాలు జరుపుతున్నారు. ఇలా ప్రతి ఏడాది నవంబర్ నుంచి ఫిబ్రవరి వరకు వ్యాపారం సాగిస్తున్నారు. తర్వాత వారి స్వస్థలాలకు వెళ్లిపోతున్నారు. వీరిలో చాలా మంది తెలుగు నేర్చుకున్నారు. స్థానిక భాషలోనే వ్యాపారాలు సాగిస్తున్నారు.

అందుబాటులోనే ధరలు

చలికాలం ప్రారంభమయ్యే సమయంలోనే నెల్లూరు నగరానికి వచ్చి మూడు నెలల పాటు ఇక్కడే ఉంటాం. తెచ్చిన ఉన్ని దుస్తులు అమ్ముకుని తరువాత మా సొంత ఊరికి వెళ్లిపోతాం. దుస్తులు నాణ్యంగా ఉండటం వల్ల జనం మా దగ్గర కొనుగోలు చేస్తున్నారు. ధరలు జనాలకు అందుబాటులోనే ఉన్నాయి. అంతేకాకుండా నెల్లూరు ప్రజలు చాల సౌమ్యులు అందుకే ఈ ఊరుంటే ఇష్టం.

– సల్మాన్, ఉత్తరప్రదేశ్

ప్రజలు ఆదరిస్తున్నారు

ఉత్తరప్రదేశ్ నుంచి మేము బృందాలుగా వచ్చి కలిసికట్టుగా వ్యాపారాలు చేసుకుంటాం. మాకు తెలుగు రాకపోయినా ఇక్కడి ప్రజలు మమ్మల్ని ఆదరిస్తూ సహకరిస్తున్నారు.

– ఇంతిజార్

క్లుప్తంగా

డైరీ ఆవిష్కరణ



నెల్లూరు (టౌన్) : స్థానిక మూలాపేటలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘ డైరీని ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు తిరుపాల్, గౌరవాధ్యక్షుడు నరసింహమూర్తి, జిల్లా అధ్యక్షుడు మస్తాన్ ఆధ్వర్యంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆర్థిక సహకారం అందించిన జానకీరామ్, వెంకటేశ్వరనాయక్, తిరుపాల్‌కు వారు అభినందనలు తెలిపారు. విశ్రాంత ఎంఈఓలు నర్సయ్య, రమేష్‌బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దాబా నిర్వాహకుడి అరెస్ట్

నెల్లూరు(క్రైమ్) : కొండాయపాళెం రోడ్డులోని దాబాపై ఎక్సైజ్ అధికారులు సోమవారం దాడి చేసి నిర్వాహకుడిని అరెస్ట్ చేశారు. బీవీనగర్‌కు చెందిన వెంకట సురేంద్రరెడ్డి కొండాయపాళెం రోడ్డులో కూల్‌డ్రింక్ షాపు పేరిట దాబా నిర్వహిస్తున్నారు. అందులో నిబంధనలకు విరుద్ధంగా మద్య సేవనం చేయిస్తున్నారు. దీనిపై సమాచారం అందుకున్న ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ నెల్లూరు-1 అధికారులు సోమవారం దాడి చేసి నిర్వాహకుడిని అరెస్ట్ చేశారు. లూజు మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.

పెన్షనర్లకు సన్మానం

నెల్లూరు(అర్బన్) : ఏపీ ప్రభుత్వ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ పక్కన రోటరీ ఆడిటోరియంలో సీనియర్ పెన్షనర్లను సోమవారం సన్మానించారు. తొలుత ఉమ్మడి రాష్ట్ర పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా పనిచేసిన పి.బలరామిరెడ్డిని ప్రత్యేకంగా సత్కరించారు. అహ్మద్, ఐ.లక్ష్మీనారాయణ, వెంకయ్య, మురళీమోహన్, సుధాకర్‌రావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆరాధనోత్సవం

నెల్లూరు(బృందావనం) : మూలాపేట బ్రాహ్మణవీధిలోని గురు నిలయంలో గొలగమూడి వెంకయ్యస్వామి శిష్యుడు మాకాని వెంకట్రావ్ స్వామి సప్తమ ఆరాధన మహోత్సవాన్ని సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొలుత గురు నిలయంలో ప్రతిష్ఠించిన భగవాన్ వెంకయ్యస్వామి, మాకాని వెంకట్రావ్ స్వామి విగ్రహాలకు అభిషేకాలు, హోమ పూజలు, సహస్ర నామార్చనలు, హారతులు ఇచ్చారు. సాయంత్రం అఖండ నామ సంకీర్తన, రాత్రి పల్లకిసేవ గావించారు. వివిధ మతాలకు చెందిన తలుపూరు నారాయణదాసు, గాలిపాళెం శ్రీహరిస్వామి, వటుకనాథస్వామి తదితరులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు విశేషంగా తరలివచ్చారు. కార్యక్రమాలను గురునిలయం నిర్వాహకుడు మాకాని గోపి, భక్త బృందం పర్యవేక్షించింది.

నెల్లూరులో పుదుచ్చేరి సీఎం



రంగస్వామికి పుష్పగుచ్ఛం ఇస్తున్న అజీజ్

నెల్లూరు(సెంట్రల్): పుదుచ్చేరి సీఎం ఎన్.రంగస్వామి సోమవారం నెల్లూరులోని రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ నివాసానికి విచ్చేశారు. ఈ సందర్భంగా సీఎంను టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు.

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు(వీఆర్సీసెంటర్) : వైఎస్సార్‌సీపీ వెంకటగిరి ఇన్‌చార్జి నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డిని ఆయన నివాసంలో ఇందిరాభవన్ ట్రస్ట్ సభ్యుడు తలారి బాలసుధాకర్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు పుష్పగుచ్ఛం ఇచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. చిన్నబాబు, విజయప్రసాద్, ప్రతాప్‌లు ఉన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



మృతుడు

నెల్లూరు(క్రైమ్) : నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్‌లో నాలుగో నంబర్ ప్లాట్‌ఫారమ్‌లో గుర్తుతెలియని వ్యక్తి సోమవారం మధ్యాహ్నం అనారోగ్యంతో మృతిచెందాడు. సుమారు 40 నుంచి 45 ఏళ్లలోపు వయస్సు కలిగి బ్ల్యూ రంగు జెర్సీ షర్టు, బ్రౌన్ రంగు ప్యాంట్ ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని నెల్లూరు రైల్వే ఎస్సై ఎన్.హరిచందన పరిశీలించారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుని వివరాలు తెలిసిన వారు రైల్వే పోలీసులను సంప్రదించాలని ఆమె కోరారు.

పారా అథ్లెట్‌కు సాయం



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) : నగరానికి చెందిన ఇంటర్నేషనల్ పారా అథ్లెట్ భవానికి ఎన్నార్టై సెల్ ద్వారా రూ.లక్ష సాయం అందింది. దీనిని శాప్ చైర్మన్ రవినాయుడు సోమవారం విజయవాడలో అందజేశారు.